యాదగిరిగుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట ప్రధానాలయంలో భక్తుల క్యూ

యాదగిరిగుట్ట, జూన్ 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తుండటంతోపాటు రెండో శనివారం సెలవు దినం కావడంతో పంచనార సింహుడిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. తిరు మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారింది. స్వామివారి ధర్మదర్శనానికి 2 గంటలు, వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణపుష్పార్చనలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి తిరువారాధన చేపట్టి స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. సుమారు 38 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.56,14,368 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. అలాగే కొండపైన సాంస్కృతిక వేదికపై ధార్మిక సాహిత్య సంగీత సభలో సప్తస్వర మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిసంగీతం భక్తులను అలరించింది.

అందుబాటులో ఉచిత వీల్‌చైర్లు..

స్వామిని దర్శించుకునేందుకు వికలాంగులు, వృద్ధులు, అనారోగ్యంతో నడవలేని స్థితిలోఉన్న భక్తులకు ప్రొటోకాల్ కార్యాలయం వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉన్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. చిరునామా అందజేసి వీల్‌చైర్లను పొందవచ్చన్నారు. దర్శనానంతరం తిరిగి అప్పగించాలని సూచించారు.

రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలి

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు సివిల్ జడ్జి చందన

రామన్నపేట : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, పక్కన అదనపు సివిల్ జడ్జి చందన

రామన్నపేట : రాజీమార్గంతో కేసులను పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు సివిల్ జడ్జి చందన అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శనికావేశంలో జరిగిన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న పేదనేరస్తులకు మండల్‌లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత న్యాయసేవ అందించడం జరుగుతుందన్నారు. కేసుల పరిష్కారం కోసం క్లైంట్‌లు,ప్రజలు, పోలీస్ యంత్రాంగం అంతా సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏజీపీ ఉయ్యాల హనుమంత, జినుకల ప్రభాకర్, పీపీ ఖాజాఅలీ, న్యాయవాదులు జగతయ్య, మామిడి వెంకట్ రెడ్డి, దినేష్, సుక్కశ్రవణ్‌కుమార్, నోముల స్వామి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య లు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : కేసుల సత్వర పరిష్కారానికే లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా కక్షిదారులు కోర్టులో 3,034 కేసులను రాజీమార్గం ద్వారా కాంప్రమైజ్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల పేరుతో ఎండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారుల పాలిట ఈ లోక్ అదాలత్ వరం లాంటిదన్నారు. రాజీ మార్గం కుదుర్చుకున్న కక్షిదారులను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాల్యం చలపతి, తాడూరి పరమేశ్, ముత్యాల సత్తిరెడ్డి, బడుగు శ్రీకాంత్, జెల్ల రమేశ్, కానుగల వెంకటయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ : లోక్ అదాలత్‌లో పాల్గొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి

రామోజీరావుకు నివాళి

యాదగిరిగుట్ట పట్టణంలో రామోజీరావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, జూన్ 8 : ప్రతికారంగానికి రామోజీరావు సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. రామోజీ గ్రూప్స్ అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగు రాష్ట్రాలు ఒక మహోన్నత వ్యక్తిని కోల్పోయాయని ఆయన అభివర్ణించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కానుగు బాలరాజుగౌడ్, సీనియర్ పాత్రికేయులు రాయగిరి పాండు, విక్రం, ఉపేందర్, శేఖర్, తాళ్ల కాంత్రికుమార్ పాల్గొన్నారు.

గొంగిడి సునీత సంతాపం

రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరనిలోటని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అభివర్ణించారు. ఈ సందర్భంగా శనివారం ఓ సందేశాన్ని విడుదల చేశారు. పత్రికా సంపాదకులుగా, వ్యాపారవేత్తగా, రామోజీ ఫిల్మ్ సిటీ, ఈ టీవి, మార్గదర్శి చిట్స్, డాల్ఫిన్ హోటల్స్, మయూరి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ స్థాపించారన్నారు. సినీ నిర్మాతగా ఎంతో మంది హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానీయుడని, పత్రికారంగానికి చుక్కాని, ఆదర్శనీయుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ

రాష్ట్ర సదస్సు ఆహ్వాన కరపత్రం ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఉపాధి హామీ కూలీలు

బొమ్మలరామారం, జూన్ 8 : ఈ నెల 10న 'గ్రామీణ ఉపాధి చట్టం అమలు-సవాళ్లు' అనే అంశంపై హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ కోరారు. శనివారం మండలంలోని మేడిపల్లిలో ఉపాధి హామీ కూలీలతో కలిసి సదస్సు కరపత్రం ఆవిష్కరించార ఉ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీకి రోజుకు రూ.300 చెల్లించాలని నిబంధనలు చెబుతున్నా.. ప్రభుత్వం రూ.150 మాత్రమే చెల్లిస్తుందన్నారు. కొలతల ద్వారా కూలి చెల్లించే పద్ధతిని తొలగించి రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. సదస్సుకు పెద్ద సంఖ్యలో హాజరై కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సల్లూరి కుమార్, ఉపాధి హామీ కూలీలు జంగమ్మ, నీలమ్మ, కృష్ణలీల, లక్ష్మి, శోభ, మాధవి, లక్ష్మి, యాదమ్మ, మంజుల, శిరీష, కొండల్, రామచంద్రం పాల్గొన్నారు.

నేడు జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్

మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్

భువనగిరి అర్బన్, జూన్ 8 : నేడు భువనగిరి బార్ అసోసియేషన్ హాల్‌లో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్‌కు యువ న్యాయవాదులంతా హాజరుకావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్ కోరారు. శనివారం బార్ అసోసియేషన్ హాల్‌లో ఐలు, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేసీజే పరీక్షలు రాసే అభ్యర్థులు నేడు ఉదయం 10:30 గంటలకు మోడల్ టెస్టుకు హాజరై తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలన్నారు. సమావేశంలో ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బొల్లేపల్లి కుమార్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గోదా వెంకటేశ్వర్లు, సభ్యులు సురకంటి జంగారెడ్డి, మహేందర్, సురేశ్, శారద పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

రామన్నపేట, జూన్ 8 : మండలంలోని నీర్నేముల గ్రామానికి చెందిన సురవి మురళి రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి దిగే క్రమంలో జారి చెట్టు పైనుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన మురళిని చుట్టుపక్కల వారు గమనించి 108లో రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

సీఎంతో ముఖాముఖికి రఘునాథపురం విద్యార్థి

కొంగరి రాకేశ్

రాజాపేట, జూన్ 8 : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 9న వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించే ముఖాముఖి కార్యక్రమానికి రఘునాథపురం హైస్కూల్ విద్యార్థి కొంగరి రాకేశ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాకేశ్ పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతో సీఎం చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం సైతం అందుకోనున్నట్లు తెలిపారు. సీఎంతో ముఖాముఖికి ఎంపికైన విద్యార్థిని ఎంఈఓ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయిలో దిగజారిన బీజేపీ ప్రతిష్ట

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

భువనగిరి అర్బన్, జూన్ 8 : జాతీయ స్థాయిలో బీజేపీ ప్రతిష్ట దిగజారిపోయిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 370-400 సీట్లు సాధించి తీరుతామని ప్రగల్భాలు పలికిన బీజేపీ మ్యాజిక్ ఫిగర్ 272 సీట్లను కూడా సాధించలేకపోయిందన్నారు. కేంద్రంలో 10 ఏండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనేక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. రామాలయం పేరుతో దేశ ప్రధాని హడావిడి చేసి ఎన్నికల ప్రచారానికి అస్త్రంగా వాడుకున్నా ప్రజలు మోదీని తిరస్కరించిన పరిస్థితి చూశామన్నారు. నేడు కొత్తగా ఏర్పడనున్న సంకీర్ణ ప్రభుత్వంతో బీజేపీ ఒంటెత్తు పోకడలకు అడ్డుకట్ట పడనుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వామపక్షాల బలం పెరిగిందని, మరింత పెరిగేందుకు ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనూరాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరి నర్సిరెడ్డి, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలి

- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం

మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం

భువనగిరి అర్బన్, జూన్ 8 : కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం డిమాండ్ చేశారు. ఈ నెల 15న ఇందిరా పార్కు దగ్గర నిర్వహించే మహాధర్నా పోస్టర్‌ను శనివారం పట్టణంలోని ఓ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల గణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చూడటం దుర్మార్గం అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కుల గణన చేయాలన్నారు. కుల గణనలో దేశానికి ఆదర్శంగా నిలిచిన బీహార్‌ను మోడల్‌గా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ నెల 15న ఇందిరా పార్కు దగ్గర బీసీ జనసభ తలపెట్టిన మహాధర్నాకు వివిధ బీసీ కుల సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయని, అన్ని బీసీ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశ్‌యాదవ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అతికం లక్ష్మీనారాయణ గౌడ్, అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, టి.జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, ఎంపీటీసీ రాసాల మల్లేశ్‌యాదవ్, నాయకులు సురేశ్, రాందేవ్, వెంకటేశ్, రాజుముదిరాజ్, రమేశ్, పాండు, రాజుయాదవ్, బాలకృష్ణ గౌడ్, అశోక్, శరత్, యాదగిరిగౌడ్, ప్రవీణ్, మహేశ్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై ఎమ్మెల్యే సామేల్ స్పందించాలి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి

మోత్కూరు, జూన్ 8 : తుంగతుర్తి నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక మాఫియాపై ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించాలని మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గతంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఇసుక దందా చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించారని ఎమ్మెల్యే సామేల్ ఆరోపించారని, ఇప్పుడు ఎమ్మెల్యే సామేల్ ఇసుక దందాతో ఎన్నికోట్లు సంపాదిస్తున్నారో చెప్పాలన్నారు. కేవలం పదవుల కోసం బీఆర్ఎస్ నాయకులను బద్నాం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న మోసాన్ని తుంగతుర్తి ప్రజలు గమనించాలన్నారు. మీరు ఇసుకకు అనుమతిస్తే సంసారం, మేము అనుమతిస్తే వ్యభిచారం ఎలా అయ్యిందో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సామేల్ ఇసుక తరలింపును అడ్డుకోవాలన్నారు. లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేసి ఇసుక తరలింపును అడ్డుకుంటామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, జంగ శ్రీను, నాయకులు సోంమల్లు, గజ్జి మల్లేశ్, విష్ణు, మర్రి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం : నీరజ

యోగాసనాలు వేయిస్తున్న ఎయిమ్స్ యోగా టీచర్ నీరజ

బొమ్మలరామారం, జూన్ 8 : నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎయిమ్స్ యోగా టీచర్ నీరజ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎయిమ్స్ బీబీనగర్ రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం యోగా ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సుఖప్రసవం కోసం యోగా ప్రాముఖ్యతను వివరించి ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఆయుష్ డాక్టర్ క్రాంతికుమార్, ఎయిమ్స్ వైద్యుడు అభిల్, ఫార్మాసిస్టు శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

క్షయ టీకాపై శిక్షణ

ఆత్మకూరు(ఎం), జూన్ 8 : త్వరలో రాబోతున్న అడల్ట్ టీబీ టీకాపై శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి మండల వైద్యాధికారి విలియం కేరి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి క్షయ సోకకుండా అడల్ట్ టీబీ టీకా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ టీకాతో ఎలాంటి దుష్పులితాలు ఉండవని సూచించారు. టీబీ టీకాను క్యాన్సర్ సోకిన వారితో పాటు గర్భిణులు, బాలింతలు, మూగ, చెవిటి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఇవ్వకూడదని సూచించారు. టీకా కుడిచేతి పైభాగంలో వేయాలని తెలిపారు. సమావేశంలో సీహెచ్ఓ కరుణాకర్, సూపర్‌వైజర్ సాంబులమ్మ, మర్యా, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) శిక్షణలో మాట్లాడుతున్న మండల వైద్యాధికారి విలియంకేరి

చేనేత సహకార సంఘంలో అవకతవకలను అరికట్టాలని వినతి

రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న చేనేత నాయకులు

చౌటుప్పల్ రూరల్, జూన్ 8 : చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో పాలకపక్షం చేస్తున్న అవకతవకలను అరికట్టాలని చౌటుప్పల్ చేనేత నాయకులు శనివారం రాష్ట్ర చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాలకపక్షం చివరి సమావేశంలో వారి అనుయాయులకు నూతన ఆర్డర్ ఫామ్‌లు ఇచ్చినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గుర్రం నర్సింహ, గోషిక రవి, గోషిక భిక్షపతి, వనం ధనుంజయ్య, గోషిక పురుషోత్తం ఉన్నారు.

ఎలాంటి అవినీతి జరుగలేదు : భిక్షపతి

పారిశ్రామిక సహకార సంఘంలో ఎలాంటి అవినీతి జరుగలేదని చౌటుప్పల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కందగట్ల భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సొసైటీ డైరెక్టర్ల నిర్ణయం మేరకే నిజమైన చేనేత కార్మికులకు ఆర్డర్ ఫామ్‌లు అందజేసిటన్లు తెలిపారు.

జలాల్‌పూర్‌లో బోనాలు

బోనాలతో వస్తున్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 8 : మండలంలోని జలాల్‌పూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో సురమాంబ సహిత కంఠమహేశ్వరస్వామి, వనం ఎల్లమ్మ, మైసమ్మ బోనాల మహోత్సవం నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళ్లి స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కంఠ మహేశ్వరస్వామి ఆలయ చైర్మన్ బైరు వెంకటేశ్‌గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పాలకూర కుమార్‌గౌడ్, ఉప సర్పంచ్ బైరు బాలరాజుగౌడ్, లక్ష్మిగౌడ్, రాజయ్య, కొయ్యడ శ్రీనివాస్, నరసింహ, బైరు శ్రీనివాస్‌గౌడ్, గడ్డం ప్రభాకర్, పాలకూర నవీన్, ఉపేందర్, భరత్‌గౌడ్, రవీందర్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టసభల్లో స్థానం కల్పించాలి

- మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సబిత

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సోమన సభిత

బొమ్మలరామారం, జూన్ 8 : మహిళలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆమె ఆధ్వర్యంలో తెలంగాణ మహిళా సమాఖ్య మండల సమావేశం జరిగింది. సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వాలు మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళల ఉపాధి కోసం బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల కమిటీ సభ్యులు వడ్లకొండ భారతమ్మ, ఇండ్ల జ్యోతి, నిమ్మల అరుణ, మౌనిక, నాగమణి, లావణ్య, సంధ్యారాణి, జయమ్మ పాల్గొన్నారు.

ఈ నెల 11న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

భువనగిరి కలెక్టరేట్, జూన్ 8 : ఈ నెల 11 జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జడ్పీ పరిషత్ సీఈఓ శోభారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు సమగ్ర నివేదికలతో రావాలని సూచించారు.

భువనగిరిలో భారీ వర్షం

భువనగిరిలో నిలిచిన వర్షపు నీరు

భువనగిరి అర్బన్, జూన్ 8 : భువనగిరి పట్టణంలో శనివారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత అధికంగా ఉండగా మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వర్షం కురువడంతో ప్రజలు ఉపశమనం పొందారు. వర్షపు నీరు పట్టణ ప్రధాన రహదారిలో నిలువడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

రోడ్డుపై వరద.. ఇబ్బందుల్లో వాహనదారులు

రామన్నపేట : భువనగిరి- చిట్యాల ప్రధాన రహదారిపై కెనరా బ్యాంక్ ముందు నిలిచిన వర్షపు నీరు

చిన్న వర్షానికే రామన్నపేట- భువనగిరి ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కురిసిన తేలికపాటి వర్షానికే రోడ్డుపై మూడుఫీట్ల లోతు నీరు నిలిచింది. అక్కడే బ్యాంకులు, చేపల మార్కెట్, ఇతర వ్యాపార సముదాయాలు ఉండటంతో ప్రజల రాకపోకలకు, ద్విచక్ర వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. చిన్న వర్షానికే ఇంత నీరు నిలుస్తుండటంతో రాబోయే వానకాలంలో పరిస్థితి ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

– రామన్నపేట, జూన్ 8

విరిగిపోయిన హైమాస్ట్ లైట్ స్తంభం

హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయరూ..

భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని మాధవరెడ్డి చౌరస్తాలో హైమాస్ట్ లైట్ లేకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ చౌరస్తాలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయగా, ఏడాది క్రితం ఓ వాహనం ఢీకొట్టడంతో స్తంభం విరిగిపోయింది. అప్పటి నుంచి రాత్రిపూట చీకటిగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

–భూదాన్‌పోచంపల్లి, జూన్ 8